

## ఉచిత రెసిడెన్షియల్ పోలీస్ రిక్రూట్‌మెంట్ కోచింగ్

7,112 పోలీసు ఉద్యోగాల భర్తీకి గ్రీన్ సిగ్నల్ 3

యువత సద్వినియోగం చేసుకోవాలి

జిల్లా ఎస్పీ సిరిసెట్టి సంకీర్త్ ఐపీఎస్


# అక్షరశక్తి

The Power of Pen

Evening Daily

మంగళవారం 4 ఆగస్టు 2026 | వరంగల్ | సంపుటి: 20 | సంచిక: 274 | పేజీలు 06


# నోటిఫికేషన్ లేకుండానే నియామకాలా..?




అక్రమాల అరాచకం

- గిరిజన సంక్షేమ శాఖలో డీడీ ఇష్టారాజ్యం
- 40 మందికిపైగా హాస్టల్ వర్కర్ల అక్రమ నియామకాలు
- ఒక్కొక్కరి నుంచి రూ.2 నుంచి రూ.3 లక్షల వరకు వసూళ్లు?
- వార్డెన్లు, ప్రధానోపాధ్యాయులపైనా వేధింపులు
- దేశిరామ్ నాయక్‌పై తీవ్ర ఆరోపణలు

2



మహబూబాబాద్ జిల్లా గిరిజన సంక్షేమ శాఖలో భారీ అక్రమాలు చోటుచేసుకున్నాయనే ఆరోపణలు కలకలం రేపుతున్నాయి. జిల్లా గిరిజన సంక్షేమ శాఖ ఇన్‌చార్జి డిప్యూటీ డైరెక్టర్‌గా వ్యవహరిస్తున్న దేశిరామ్ నాయక్ ప్రభుత్వ నిబంధనలను పక్కనపెట్టి హాస్టళ్లలో 40 మందికిపైగా వర్కర్లను అక్రమంగా నియమించారని ఆరోపణలు బలంగా వినిపిస్తున్నాయి. కలెక్టర్, గిరిజన సంక్షేమ కమిషనర్, సెక్రటరీ, ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి, సంబంధిత అధికారుల అనుమతి లేకుండానే ఇష్టానుసారంగా నియామకాలు చేపట్టినట్లు సమాచారం. వివిధ ఆశ్రమ పాఠశాలలో, ప్రి మెట్రిక్ వసతి గృహాలలో, కళాశాల వసతి గృహాలలో ఎటువంటి నోటిఫికేషన్లు లేకుండా వర్కర్లను నియమించడం వెనుక పెద్దమొత్తం అవినీతి జరిగినట్లు తెలుస్తోంది. ఈ నియామకాల కోసం ఒక్కో అభ్యర్థి నుంచి రూ.2 లక్షల నుంచి రూ.3 లక్షల వరకు లంచాలు వసూలు చేసినట్లు సమాచారం. ఈ విధంగా అక్రమ నియామకాల వల్ల అర్హత ఉన్న నిరుద్యోగులకు ఉద్యోగ అవకాశాలు దూరమయ్యాయి. - అక్షరశక్తి ప్రతినిధి, మహబూబాబాద్

# ప్రసాద్ పథకం పనులను వేగవంతంగా పూర్తి చేయాలి

**మంత్రి సీతక్క**

**అక్షరశక్తి, ములుగు:** వెంకటాపూర్ మండలం పాలంపేటలోని రామప్ప దేవాలయం వద్ద కేంద్ర ప్రభుత్వ ప్రసాద్ (PRASAD) పథకం కింద రూ.61.99 కోట్ల వ్యయంతో చేపడుతున్న పర్యాటక మౌలిక సదుపాయాల అభివృద్ధి పనులను రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, గ్రామీణ నీటి సరఫరా, మహిళా, శిశు సంక్షేమ శాఖ మంత్రి దనసరి అనసూయ సీతక్క మంగళవారం పరిశీలించారు. జిల్లా కలెక్టర్ బోర్ఖడే హేమంత్ సహదేవరావుతో కలిసి నిర్మాణ పనుల ప్రాంతాన్ని సందర్శించిన మంత్రి, జరుగుతున్న పనుల పురోగతిని అధికారులను అడిగి తెలుసుకున్నారు. పనులను నిర్దేశిత గడువులోగా పూర్తి చేయడంతో పాటు నాణ్యత ప్రమాణాలను తప్పనిసరిగా పాటించాలని అధికారులను ఆదేశించారు. ఈ పరిశీలన కార్యక్రమంలో అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) సంపత్ రావు, గ్రంథాలయ సంస్థ చైర్మన్ బానోతు రవిచందర్, మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ రేగ కళ్యాణి, పంచాయతీరాజ్ డైరెక్టర్ భగవాన్ రెడ్డి, టూరిజం డీఈ నటరాజ్, ఏఈ విజయ్, ప్రజాప్రతినిధులు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.





5

## కాజీపేట బ్రిడ్జిపై బీజేపీ ధర్నా

4-08-2026_Layout 1 04-08-2026 20:03 Page 2



# నోటిఫికేషన్ లేకుండానే నియామకాలా..?

**గిరిజన సంక్షేమ శాఖలో డీడీ ఇష్టారాజ్యం**

**40 మందికిపైగా హాస్టల్ వర్కర్ల అక్రమ నియామకాలు**

**ఒక్కొక్కరి నుంచి రూ.2 నుంచి రూ.3 లక్షల వరకు వసూళ్లు?**

**వార్డెన్లు, ప్రధానోపాధ్యాయులపైనా వేధింపులు**

**దేశిరామ్ నాయక్‌పై తీవ్ర ఆరోపణలు**

**అక్షరశక్తి ప్రతినిధి, మహబూబాబాద్ :** మహబూబాబాద్ జిల్లా గిరిజన సంక్షేమ శాఖలో భారీ అక్రమాలు చోటుచేసుకున్నాయనే ఆరోపణలు కలకలం రేపుతున్నాయి. జిల్లా గిరిజన సంక్షేమ శాఖ ఇన్‌చార్జి డిప్యూటీ డైరెక్టర్‌గా వ్యవహరిస్తున్న దేశిరామ్ నాయక్ ప్రభుత్వ నిబంధనలను పక్కనపెట్టి హాస్టళ్లలో 40 మందికిపైగా వర్కర్లను అక్రమంగా నియమించారని ఆరోపణలు బలంగా వినిపిస్తున్నాయి. కలెక్టర్, గిరిజన సంక్షేమ కమిషనర్, సెక్రటరీ, ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి, సంబంధిత అధికారుల అనుమతి




లేకుండానే ఇష్టానుసారంగా నియామకాలు చేపట్టినట్లు సమాచారం. వివిధ ఆశ్రమ పాఠశాలలో, ప్రి మెట్రిక్ వసతి గృహాలలో, కళాశాల వసతి గృహాలలో ఎటువంటి నోటిఫికేషన్లు లేకుండా వర్కర్లను నియమించడం వెనుక పెద్దమొత్తం అవినీతి జరిగినట్లు తెలుస్తోంది. ఈ నియామకాల కోసం ఒక్కో అభ్యర్థి నుంచి రూ. 2 లక్షల నుంచి రూ. 3 లక్షల వరకు లంచాలు వసూలు చేసినట్లు సమాచారం. ఈ విధంగా అక్రమ నియామకాల వల్ల అర్హత ఉన్న నిరుద్యోగులకు ఉద్యోగ అవకాశాలు దూరమయ్యాయి.

## యూనిక్ ఐడీలు కూడా అక్రమంగానే..?

ఇన్‌చార్జి డీడీగా దేశిరామ్‌నాయక్ గిరిజన సంక్షేమ శాఖను భ్రష్టుపట్టించారనే విమర్శలు ఉన్నాయి. అక్రమంగా నియమించిన వర్కర్లకు



నిబంధనలకు విరుద్ధంగా ఏకంగా యూనిక్ ఐడీలు జారీ చేశారన్న ఆరోపణలు కూడా వినిపిస్తున్నాయి. ఈ ప్రక్రియలో ప్రభుత్వ అనుమతులు, అధికారిక ఆమోదాలు తీసుకోలేదని తెలుస్తోంది. ఈ మేరకు ఉన్నతాధికారులకు కూడా ఫిర్యాదులు అందడం గమనార్హం. దీనిపై సమగ్ర విచారణ జరిపితే పూర్తి వివరాలు వెలుగులోకి వస్తాయని వారు అభిప్రాయపడుతున్నారు.

దేశిరామ్ నాయక్ తన అధికార పరిధిని మించి వ్యవహరిస్తున్నారనే విమర్శలు ఉన్నాయి. అంతేగాకుండా, కొంతమంది ప్రైవేటు వ్యక్తులను అడ్డం పెట్టుకుని హాస్టళ్లలోని ప్రధానోపాధ్యాయులు, వార్డెన్లపై సమాచార హక్కు చట్టం (ఆర్‌టీఐ) ద్వారా నోటీసులు పంపిస్తూ వారిని మానసిక ఒత్తిడికి గురిచేస్తున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. ఈ పరిస్థితిని ఆసరాగా చేసుకుని ఉద్యోగుల నుంచి డబ్బులు వసూలు చేస్తున్నారని కూడా తెలుస్తోంది.

## అర్హతపై కూడా అనేక ప్రశ్నలు

ఇన్‌చార్జి డీడీ దేశిరామ్‌నాయక్‌కు సంబంధించి మరో కీలక అంశం కూడా తీవ్ర వివాదాస్పదంగా మారుతోంది. ఏటీడీవోగా పనిచేస్తున్న వ్యక్తికి జిల్లా డిప్యూటీ డైరెక్టర్ ఇన్‌చార్జి బాధ్యతలు అప్పగించడం నిబంధనలకు విరుద్ధమని, అయినప్పటికీ దేశిరామ్ నాయక్‌కు ఆ బాధ్యతలు అప్పగించారని పలువురు పేర్కొన్నారు. ఇటీవల బదిలీ అయినప్పటికీ, తిరిగి ఇదే జిల్లాలో కొనసాగుతుండడం గమనార్హం. పూర్తిస్థాయి బాధ్యతలు చేపట్టేందుకు వచ్చిన డీడీని కూడా తిరిగిపంపించే స్థాయిలో దేశిరామ్‌నాయక్ ఉండడం గమనార్హం. కాగా, ఇక్కడ మరొక విషయం ఏమిటంటే, గతంలో మహబూబాబాద్ ఏటీడీవోగా పనిచేసిన సమయంలో కాంట్రాక్టు రెసిడెన్షియల్ టీచర్ల (సీఆర్‌టీల) నియామకాలలో కూడా అక్రమాలు జరిగాయని, ఆ అంశంపై అప్పటి జిల్లా కలెక్టర్ చర్యలు తీసుకున్నారు.

# ద్విచక్ర వాహనాల చోరీల నివారణకు అప్రమత్తంగా ఉండాలి

**వరంగల్ పోలీస్ కమిషనర్ ఎన్. శ్వేత**

**అక్షరశక్తి, హనుమకొండ క్రైమ్:** వరంగల్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో ద్విచక్ర వాహనాల చోరీలను నివారించేందుకు ప్రజలు అప్రమత్తంగా ఉండాలని వరంగల్ పోలీస్ కమిషనర్ ఎన్. శ్వేత, ఐపీఎస్ సూచించారు. ఈ మేరకు మంగళవారం విడుదల చేసిన పత్రికా ప్రకటనలో వాహన భద్రతకు సంబంధించిన పలు కీలక సూచనలను వెల్లడించారు. వాహనాలను పార్క్ చేసే సమయంలో తప్పనిసరిగా స్టీరింగ్ లాక్, హ్యాండిల్ లాక్‌తో పాటు అవసరమైతే డిస్క్ లాక్ లేదా చైన్ లాక్ ఉపయోగించాలని సూచించారు. ముఖ్యంగా రాత్రి వేళల్లో లేదా ఎక్కువ సమయం పాటు వాహనాన్ని నిలిపివేయాల్సి వచ్చినప్పుడు సీసీ కెమెరాల నిఘా ఉన్న, వెలుతురు బాగా ఉండే ప్రదేశాలను మాత్రమే ఎంచుకోవాలని పేర్కొన్నారు. వాహనంలో తాళం చెవిని ఉంచి వెళ్లకూడదని, స్పేర్ కీని కూడా వాహనంలోనే దాచిపెట్టకూడదని హెచ్చరించారు. అలాగే వాహనానికి జీపీఎస్ ట్రాకింగ్ పరికరం లేదా యాంటీ-థెఫ్ట్ అలారం అమర్చుకోవడం ద్వారా చోరీలను నివారించే అవకాశం ఉంటుందని తెలిపారు.

వాహనానికి సంబంధించిన రిజిస్ట్రేషన్ సర్టిఫికేట్ (ఆర్‌సీ), బీమా పత్రాలు, ఇంజిన్ నంబర్, ఛాసిస్ నంబర్ వంటి వివరాలను భద్రంగా ఉంచుకోవాలని సూచించారు. అనుమానాస్పదంగా వాహనాల చుట్టూ సంచరిస్తున్న వ్యక్తులు కనిపిస్తే వెంటనే సమీప పోలీస్ స్టేషన్‌కు లేదా డయల్-100, 112 నంబర్లకు సమాచారం ఇవ్వాలని కోరారు.

వాహనం చోరీకి గురైనట్లు గుర్తించిన వెంటనే ఆలస్యం చేయకుండా సమీప పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు




చేయాలని, అలాగే సెకండ్ హ్యాండ్ వాహనాలను కొనుగోలు చేసే ముందు వాహనం పత్రాలు, యాజమాన్య వివరాలు, పోలీసు రికార్డులను తప్పనిసరిగా పరిశీలించాలని కమిషనర్ సూచించారు. వాహన భద్రత ప్రతి ఒక్కరి బాధ్యత అని పేర్కొన్న కమిషనర్ ఎన్. శ్వేత, చిన్నపాటి నిర్లక్ష్యం కూడా వాహన చోరీకి కారణమవుతుందని తెలిపారు. ప్రజలు ఈ సూచనలను తప్పనిసరిగా పాటించి, అనుమానాస్పద వ్యక్తులు లేదా సంఘటనల గురించి వెంటనే పోలీసులకు సమాచారం అందించడం ద్వారా నేరాల నియంత్రణలో పోలీసులకు సహకరించాలని విజ్ఞప్తి చేశారు.

# అతిథి అధ్యాపకుల నియామకానికి దరఖాస్తుల ఆహ్వానం

**అక్షరశక్తి,వరంగల్:** దేశాయిపేటలోని సీకేఎం ప్రభుత్వ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాలలో 2026--27 విద్యా సంవత్సరానికి అతిథి అధ్యాపకుల (+బవర్ ఖీఖఎబశ్రీఎ) నియామకానికి అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ జి. పోశయ్య తెలిపారు. కంప్యూటర్ సైన్స్ విభాగంలో రెండు అతిథి అధ్యాపకుల పోస్టులు ఖాళీగా ఉన్నాయని వెల్లడించారు. ఓసీ, బీసీ అభ్యర్థులు సంబంధిత సబ్జెక్టులో 55 శాతం మార్కులతో, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులు 50 శాతం మార్కులతో ఉత్తీర్ణులై ఉండాలని పేర్కొన్నారు.

అభ్యర్థుల ఎంపికలో పీహెచ్‌డీ, నెట్, సెట్ అర్హతలు కలిగి ఉండటంతో పాటు బోధన అనుభవం ఉన్న వారికి తొలి ప్రాధాన్యం ఇవ్వనున్నట్లు తెలిపారు. అర్హులైన అభ్యర్థులు తమ దరఖాస్తులను ఆగస్టు 11, 2026 సాయంత్రం 4 గంటలలోగా కళాశాలకు సమర్పించాలని సూచించారు. అందిన దరఖాస్తులను పరిశీలించిన అనంతరం అర్హులైన అభ్యర్థులకు సమాచారం అందించి ఎంపిక ప్రక్రియ నిర్వహించనున్నట్లు తెలిపారు. పూర్తి వివరాల కోసం అభ్యర్థులు సీకేఎం ప్రభుత్వ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల, దేశాయిపేట, వరంగల్ను సంప్రదించాలని ప్రిన్సిపాల్ సూచించారు.

# త్రైమాసిక పన్ను బకాయిలపై రవాణా శాఖ ప్రత్యేక డ్రైవ్

**అక్షరశక్తి, మహబూబాబాద్:** జిల్లాలో త్రైమాసిక వాహన పన్ను చెల్లించని వాహనాలపై రవాణా శాఖ ప్రత్యేక డ్రైవ్ చేపట్టింది. ఈ మేరకు మొత్తం 326 వాహనాలను గుర్తించి యజమానులకు నోటీసులు జారీ చేస్తున్నట్లు జిల్లా రవాణా అధికారి శంకర్ నాయక్ తెలిపారు. నోటీసులు అందుకున్న వాహన యజమానులు 10 రోజుల్లోపు పన్ను చెల్లించకపోవడానికి కారణాలు తెలియజేయాలని సూచించారు. స్పందించని వారిపై వాహనాలను సీజ్ చేయడం, అవసరమైతే మోటార్ వాహనాల చట్టం ప్రకారం రిజిస్ట్రేషన్ రద్దు చేసే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. వాహన యజమానులు మీ సేవా కేంద్రాలు, ఆన్‌లైన్ లేదా మొబైల్ ద్వారా వెంటనే పన్ను బకాయిలు చెల్లించాలని డీటీఓ విజ్ఞప్తి చేశారు.

4-08-2026_Layout 1 04-08-2026 20:03 Page 3



# ప్రభుత్వ ఆసుపత్రుల్లో సాధారణ ప్రసవాలను ప్రోత్సహించాలి



**అక్షరశక్తి ఐనవోలు:** ప్రభుత్వ ఆసుపత్రులు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో సాధారణ ప్రసవాల సంఖ్య పెరిగేలా ప్రత్యేక చర్యలు చేపట్టాలని హనుమకొండ జిల్లా ఇన్‌చార్జి కలెక్టర్ ఎన్. రవి వైద్యాధికారులు, ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలను ఆదేశించారు. మంగళవారం హనుమకొండ జిల్లా ఐనవోలు మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఇన్‌చార్జి కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆసుపత్రిలో అందిస్తున్న వైద్య సేవలు, మౌలిక వసతులు, మందుల నిల్వలు, రోగులకు అందుతున్న సేవలపై క్షేత్రస్థాయిలో పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఓపీ రిజిస్టర్‌ను పరిశీలించిన కలెక్టర్, ప్రతిరోజు ఎంతమంది రోగులు చికిత్స పొందుతున్నారనే వివరాలను మెడికల్ ఆఫీసర్ డాక్టర్ శ్రీదేవిని అడిగి తెలుసుకున్నారు. అనంతరం మందులు, వైద్య సామగ్రి నిల్వ ఉంచిన స్టోర్‌రూమ్‌ను పరిశీలించి, అవసరమైన మందులు ఎల్లప్పుడూ అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఆసుపత్రిలో పరిశుభ్రత, రోగులకు అందుతున్న వైద్య సేవలపై వైద్యులు, సిబ్బందితో సమీక్ష నిర్వహించారు. ఆరోగ్య స్వస్థత కేంద్రంలో ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలతో సమావేశమైన కలెక్టర్, ఆరోగ్య కేంద్రం పరిధిలో ఇప్పటివరకు జరిగిన సాధారణ ప్రసవాల సంఖ్య, గర్భిణులకు అందిస్తున్న సేవలు, అవగాహన కార్యక్రమాలపై వివరాలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఇన్‌చార్జి కలెక్టర్ ఎన్. రవి మాట్లాడుతూ, గర్భిణులను ప్రభుత్వ ఆసుపత్రుల్లోనే ప్రసవాలకు ప్రోత్సహించేలా విస్తృత అవగాహన కల్పించాలని సూచించారు. అవసరం లేని సిజేరియన్ ప్రసవాలు తగ్గించి, సాధారణ ప్రసవాలను ప్రోత్సహించడం ద్వారా తల్లి, శిశువు ఆరోగ్యాన్ని కాపాడడంతో పాటు కుటుంబాలపై ఆర్థిక భారం కూడా తగ్గుతుందని పేర్కొన్నారు. ప్రభుత్వ ఆసుపత్రులు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో సాధారణ ప్రసవాల సంఖ్యను పెంచేందుకు ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు. సాధారణ ప్రసవాలను అత్యధికంగా ప్రోత్సహించిన ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలను ప్రోత్సాహక అవార్డులతో సత్కరించేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు.

ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని, రోగులకు నాణ్యమైన వైద్య సేవలు అందించడంలో ఎలాంటి నిర్లక్ష్యానికి తావు లేకుండా పనిచేయాలని వైద్య సిబ్బందికి సూచించారు. ఈ తనిఖీలో స్థానిక తహసీల్దార్ విక్రమ్ కుమార్, వైద్యాధికారులు, ఇతర సంబంధిత అధికారులు పాల్గొన్నారు.




## చిన్నారుల ఆరోగ్యానికి తల్లిపాలే ఉత్తమ ఆహారం: పెండెం రాజు

**అక్షరశక్తి, ఆత్మకూరు:** చిన్నారుల ఆరోగ్యకరమైన ఎదుగుదలకు తల్లిపాలే అత్యుత్తమమైన, సంపూర్ణమైన ఆహారమని ఎంపీపీఎస్ ఆత్మకూరు ప్రధానోపాధ్యాయులు పెండెం రాజు పేర్కొన్నారు. ప్రపంచ తల్లిపాల వారోత్సవాల సందర్భంగా మంగళవారం ప్రాథమిక పాఠశాల ఆవరణలోని అంగన్వాడీ కేంద్రంలో అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా పాల్గొన్న ప్రధానోపాధ్యాయులు పెండెం రాజు మాట్లాడుతూ, ప్రతి సంవత్సరం ఆగస్టు 1 నుంచి 7 వరకు ప్రపంచ తల్లిపాల వారోత్సవాలు నిర్వహించడం ద్వారా తల్లిపాల ప్రాముఖ్యతపై ప్రజల్లో అవగాహన కల్పిస్తున్నారని తెలిపారు. ప్రతి తల్లి తన బిడ్డకు కనీసం తొలి ఆరు నెలలు పూర్తిగా తల్లిపాలు మాత్రమే ఇవ్వాలని, అనంతరం అనుబంధ ఆహారంతో పాటు రెండేళ్లు లేదా అంతకంటే ఎక్కువ కాలం తల్లిపాలను కొనసాగించడం శిశు ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ టీచర్లు దేవమ్మ, వాణి, అంగన్వాడీ ఆయా సరోజనతో పాటు చిన్నారుల తల్లులు పాల్గొన్నారు.

## డ్రగ్ ఫ్రీ క్యాంపస్ లక్ష్యంగా కార్యాచరణ

### కేయూ వీసీ ఆచార్య కె. ప్రతాప్ రెడ్డి

**అక్షరశక్తి, హైదరాబాద్ :** హైదరాబాద్‌లోని లోక్‌భవన్‌లో నిర్వహించిన రాష్ట్ర విశ్వవిద్యాలయాల ఉపకులపతుల సమావేశంలో కాకతీయ విశ్వవిద్యాలయం ఉపకులపతి ఆచార్య కె. ప్రతాప్ రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా కేంద్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన మై భారత్ పోర్టల్‌లో విద్యార్థుల నమోదు, యూత్ రెడ్ క్రాస్ ఏర్పాటు, నషా ముక్త్ భారత్ అభియాన్ అమలులో విశ్వవిద్యాలయాల భాగస్వామ్యంపై జరిగిన చర్చల్లో ఆయన పాల్గొన్నారు. కాకతీయ విశ్వవిద్యాలయ పరిధిలోని ఉత్తర తెలంగాణ ప్రాంతంలోని 12 జిల్లాల్లో సుమారు 1.50 లక్షల మంది విద్యార్థులు విద్యాభ్యాసం చేస్తున్నారని, 356 ఎన్ఎస్ఎస్ యూనిట్లలో 35,600 మంది ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు సేవలందిస్తున్నారని ఆయన వివరించారు. మాదకద్రవ్యాల నిర్మూలనపై సీనియర్ అధ్యాపకులు, పోలీసు శాఖ, స్వచ్ఛంద సేవా సంస్థల సహకారంతో విస్తృత స్థాయిలో అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. విశ్వవిద్యాలయాన్ని డ్రగ్ ఫ్రీ క్యాంపస్‌గా తీర్చిదిద్దడమే తమ లక్ష్యమని పేర్కొన్నారు. యూత్ రెడ్ క్రాస్ ఏర్పాటు కోసం త్వరలోనే నోడల్ అధికారులను నియమించనున్నట్లు తెలిపారు. అలాగే ఎన్ఎస్ఎస్ వాలంటీర్లతో పాటు ఇతర విద్యార్థులను కూడా మై భారత్ పోర్టల్‌లో నమోదు చేసుకునేలా ప్రోత్సహిస్తామని చెప్పారు. కాకతీయ విశ్వవిద్యాలయం ఎన్ఎస్ఎస్ విభాగం నిర్వహిస్తున్న సేవా కార్యక్రమాలు, రక్తదాన శిబిరాలు, సామాజిక సేవా కార్యక్రమాల వివరాలను రాష్ట్ర గవర్నర్‌కు ఈ సందర్భంగా వివరించినట్లు ఉపకులపతి ఆచార్య కె. ప్రతాప్ రెడ్డి తెలిపారు.




# ఉచిత రెసిడెన్షియల్ పోలీస్ రిక్రూట్‌మెంట్ కోచింగ్



### యువత సద్వినియోగం చేసుకోవాలి

### జిల్లా ఎస్పీ సిరిశెట్టి సంకీర్త్

**అక్షరశక్తి, భూపాలపల్లి :** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం పోలీసు శాఖ, ఎస్‌పీఎఫ్, జైళ్ల శాఖ తదితర విభాగాల్లో సుమారు 7,112 ఖాళీల భర్తీకి గ్రీన్ సిగ్నల్ ఇచ్చిన నేపథ్యంలో, భూపాలపల్లి జిల్లా నిరుద్యోగ యువతకు పోలీసు ఉద్యోగాలు సాధించేందుకు జిల్లా పోలీసు శాఖ ఆధ్వర్యంలో ఉచిత రెసిడెన్షియల్ పోలీస్ రిక్రూట్‌మెంట్ కోచింగ్ నిర్వహించనున్నట్లు జిల్లా ఎస్పీ సిరిశెట్టి సంకీర్త్, ఐపీఎస్ తెలిపారు. జిల్లాలోని పేద, గ్రామీణ, గిరిజన, మారుమూల ప్రాంతాల యువతకు నాణ్యమైన శిక్షణ అందించి పోలీసు ఉద్యోగాలకు సిద్ధం చేయాలనే లక్ష్యంతో ఈ కార్యక్రమాన్ని చేపడుతున్నట్లు ఎస్పీ తెలిపారు. అనుభవజ్ఞులైన అధ్యాపకులు, అర్హత కలిగిన ఫిజికల్ ట్రైనర్ల ఆధ్వర్యంలో ఉచితంగా శిక్షణ అందించబడుతుందని, ఇందులో ఉచిత వసతి, తరగతి బోధన, శారీరక శిక్షణ కల్పించనున్నట్లు పేర్కొన్నారు. పోలీసు శాఖలో చేరాలనే ఆసక్తి ఉన్న అభ్యర్థులు 04-08-2026 నుండి 15-08-2026 వరకు తమ సమీప పోలీస్ స్టేషన్‌లో పేర్లు నమోదు చేసుకోవాలని సూచించారు. మహిళా అభ్యర్థులు కూడా ఈ అవకాశాన్ని తప్పకుండా వినియోగించుకోవాలని కోరారు.

కోచింగ్ ప్రారంభ తేదీ, శిక్షణా కేంద్రం, ఇతర పూర్తి వివరాలను త్వరలో అధికారికంగా మీడియా ద్వారా వెల్లడిస్తామని తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ, పోలీసు ఉద్యోగం లక్ష్యంగా పెట్టుకున్న ప్రతి యువకుడు, యువతి ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి. క్రమశిక్షణతో శ్రమించి తెలంగాణ పోలీసు శాఖలో ఉద్యోగం సాధించి జీవితంలో ఉన్నత స్థాయికి చేరుకోవాలని” ఆకాంక్షించారు.

4-08-2026_Layout 1 04-08-2026 20:03 Page 4



# బిజెపి ప్రజా వ్యతిరేక విధానాలను నిరసిస్తూ 6 నుంచి ప్రచార జాత

### సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి తోట బిక్షపతి

**అక్షరశక్తి, హనుమకొండ :** కేంద్ర బిజెపి ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలను ప్రజల్లో ఎండగడుతూ సిపిఐ ప్రచార జాత ఆగస్టు 6 నుండి 11 వరకు జిల్లాలో నిర్వహిస్తుందని, ఈ జాతలను విజయవంతం చేయాలని సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి తోట బిక్షపతి పిలుపునిచ్చారు. మంగళవారం హనుమకొండ మండలంలోని గుండ్ల సింగారం సురవరం సుధాకర్ రెడ్డి నగర్ లో సిపిఐ ప్రచార జాత ఛలో డిల్లీ వాల్ పోస్టర్లను సిపిఐ నాయకులు విడుదల చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైనా సిపిఐ జిల్లా కార్యదర్శి కర్రె బిక్షపతి మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలను నిరసిస్తూ జిల్లాలో ఆగస్టు 6 నుండి 11 వరకు ప్రచార జాత సిపిఐ నిర్వహిస్తుందని, ఆగస్టు 6వ తేదిన కాజీపేటలో సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కలపల్లి శ్రీనివాసరావు జాతను ప్రారంభిస్తారని, ఈ జాత జిల్లాలో గ్రామ గ్రామనా యాత్ర చేసి ఆగస్టు 11వ తేదీన హనుమకొండ లోని వేయి స్థంబాల గుడి నుండి పబ్లిక్ గార్డెన్ వరకు ర్యాలీతో ముగిస్తుందని తెలిపారు. ఆగస్టు 7, 8 తేదీల్లో జరిగే ప్రచార జాతలో సిపిఐ సీనియర్ నాయకులు, మాజీ ఎమ్మెల్యే చాడ వెంకట రెడ్డి పాల్గొంటారని తెలిపారు. ఈ జాత ద్వారా కేంద్ర ప్రభుత్వం వ్యవహరిస్తున్న తీరును ప్రజలకు వివరిస్తూ ప్రతి గ్రామంలో ఉన్న ప్రజా సమస్యల పైన పోరాటాలు కొనసాగిస్తూ సెప్టెంబర్ 1వ తేదీన ఛలో ఢిల్లీతో ముగుస్తుందని అన్నారు. జిల్లాలో జరిగే ప్రచార జాతను విజయవంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సిపిఐ మండల ఎన్ ఎ స్టాలిన్, మండల సహాయ కార్యదర్శి గుంటీ రాజేందర్, నాయకులు పొనుగోటి రాముగోపాల్ చారి, పూజారి అమృతయ్య, మామునూరి దామోదర్, కేతపాక ప్రసాద్, తాటికొండ ప్రశాంత్, నలువల సంధ్య, తాటికంటి మమత, తోట రామారావు, తిప్పనపల్లి మోహన్, పెనుకుల మధు, పెనుకుల మధు, లక్కం రాజు, రాయబారపు శ్రీనివాస్, రెసోజు రాజు, సిలివోజు హేమలత, సపవట్ దేవి తదితరులు పాల్గొన్నారు.






## మైసంపల్లిలో తల్లిపాల వారోత్సవాలు

**అక్షరశక్తి, దుగ్గొండి :** వరంగల్ జిల్లా దుగ్గొండి మండలం మైసంపల్లి గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రంలో అంతర్జాతీయ తల్లిపాల వారోత్సవాల కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి హాజరైన సూపర్‌వైజర్ జయరాణి మాట్లాడుతూ బిడ్డ పుట్టిన గంటలోపు తల్లిపాలు తాగించాలని మొదటి గంటలోపు వచ్చే పాలను ముర్రుపాలు అంటారని ఈ ముర్రు పాలు బిడ్డకు రోగ నిరోధక శక్తిని పెంచుతుందని బిడ్డ పుట్టినప్పటినుంచి ఆరు నెలల వరకు కేవలం తల్లిపాలు మాత్రమే ఇవ్వాలని సూచించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా గ్రామ సర్పంచ్ వేములఇంద్ర దేవ్, ఉప సర్పంచ్ ఆనంద్, వార్డు మెంబర్స్ రవి, విజయలత, ఉపాధ్యాయులు సాంబయ్య, వెంకటలక్ష్మి, అంగన్వాడీ టీచర్లు సుందరి ఇందిరా రాజేశ్వరి భాగ్య ఆయమ్మ సవిత అంగన్వాడి పిల్లలు తల్లులు పాల్గొన్నారు.

## "సురక్ష కా తిరంగా" సైబర్ అవగాహన కార్యక్రమాలు ప్రారంభం

**అక్షరశక్తి, హనుమకొండ క్రైమ్:** స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని వరంగల్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో ఆగస్టు 5 నుంచి నాలుగు వారాల పాటు "సురక్ష కా తిరంగా" సైబర్ క్రైమ్ అవగాహన కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు పోలీసులు తెలిపారు. డీజీపీ సూచనలు, తెలంగాణ సైబర్ సెక్యూరిటీ బ్యూరో ఆదేశాల మేరకు పోలీస్ కమిషనర్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాలు చేపడుతున్నారు. సైబర్ ప్రతిజ్ఞ, అవగాహన సమావేశాలు, పోస్టర్ల విడుదల, ర్యాలీలు, మీడియా బ్రీఫింగ్, సోషల్ మీడియా ప్రచారం వంటి కార్యక్రమాలు నిర్వహించనున్నారు. తొలి రోజు కాళోజీ కళాక్షేత్రం, కలెక్టర్ కార్యాలయం, ప్రభుత్వ జూనియర్ కళాశాల, కాకతీయ మెడికల్ కళాశాల, కాకతీయ యూనివర్సిటీ ఇంజినీరింగ్ కళాశాల, సీకేఎం కళాశాలతో పాటు వివిధ పోలీస్ స్టేషన్ పరిధుల్లో అవగాహన కార్యక్రమాలు చేపట్టనున్నారు. ప్రజలు ఈ కార్యక్రమాల్లో పాల్గొని సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలని వరంగల్ పోలీస్ కమిషనరేట్ విజ్ఞప్తి చేసింది.



## పెద్ది సుదర్శన్ రెడ్డి సేవలకు తగిన గుర్తింపు ఇవ్వాలి

### కేయూ జేఏసీ నాయకుల డిమాండ్

**అక్షరశక్తి, నర్సంపేట :** వరంగల్ జిల్లా నర్సంపేట మండలం, నల్లబెల్లి గ్రామంలో తెలంగాణ ఉద్యమకారుడు, నర్సంపేట మాజీ ఎమ్మెల్యే, సీనియర్ నాయకులు స్వర్గీయ పెద్ది సుదర్శన్ రెడ్డి 5వ రోజు సంతాప కార్యక్రమంలో పాల్గొని నివాళులర్పించిన నాయకులు అనంతరం కేయు జేఏసీ చైర్మన్ డా. సాదు రాజేష్, డా. సయ్యద్ వలీ ఉల్లా ఖాద్రీ (ఏఐవైఎఫ్ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు), డా. చిర్రా రాజు (కేయు పాలకమండలి సభ్యులు), జేఏసీ నేత జోరిక రమేష్ మీడియాతో మాట్లాడారు. వారు మాట్లాడుతూ, తెలంగాణ రాష్ట్ర సాధన ఉద్యమంలోనూ, ప్రజా జీవితంలోనూ పెద్ది సుదర్శన్ రెడ్డి అందించిన సేవలు చిరస్మరణీయమని అన్నారు. బీఆర్ఎస్ పార్టీ ఆవిర్భావం నుంచి పార్టీ బలోపేతానికి, ప్రజా సమస్యల పరిష్కారానికి ఆయన చేసిన కృషిని ప్రభుత్వం గుర్తించాలని కోరారు. రాష్ట్ర ప్రభుత్వం వెంటనే నర్సంపేటలో నూతనంగా ఏర్పాటు చేసిన ప్రభుత్వ వైద్య కళాశాలకు పెద్ది సుదర్శన్ రెడ్డి పేరును నామకరణం చేయాలని డిమాండ్ చేశారు. అలాగే ఆయన కుటుంబాన్ని అన్ని విధాలుగా ఆదుకుని, వారి సేవలను గుర్తిస్తూ రూ.10 కోట్ల ఆర్థిక సహాయాన్ని ప్రకటించాలని కోరారు. అదేవిధంగా, వరంగల్‌లో ప్రతిపాదిత నూతన విమానాశ్రయానికి పెద్ది సుదర్శన్ రెడ్డి పేరును పెట్టాలని, అలాగే పాకాల చెరువు బండ్‌పై ఆయన కాంస్య విగ్రహాన్ని ఏర్పాటు చేసి తెలంగాణ ఉద్యమానికి ఆయన చేసిన సేవలకు శాశ్వత గుర్తింపునివ్వాలని ప్రభుత్వాన్ని కోరారు. ఈ కార్యక్రమంలో డా. ఫిరోజ్ పాషా, డా. వి. ఎస్. యాకుబ్ రెడ్డి, నలిగంటి శరత్, డా. భైరపాక ప్రశాంత్, లంక రాజగోపాల్, రామూర్తి, దామోదర్ పాల్గొన్నారు.

## ఎన్‌హెచ్-163పై అసంపూర్తి సర్వీస్ రోడ్లను వెంటనే పూర్తి చేయాలి

### వరంగల్ ఎంపీ డా.కడియం కావ్య



**అక్షరశక్తి, వరంగల్ :** యాదాద్రి--వరంగల్ మధ్య జాతీయ రహదారి-163పై అసంపూర్తిగా ఉన్న సర్వీస్ రోడ్ల నిర్మాణాన్ని త్వరితగతిన పూర్తి చేయాలని వరంగల్ పార్లమెంట్ సభ్యురాలు డాక్టర్ కడియం కావ్య కోరారు. మంగళవారం న్యూఢిల్లీలో జాతీయ రహదారుల ప్రాధికార సంస్థ (ఎన్‌హెచ్ఏఐ) చైర్మన్ సంతోష్ కుమార్ యాదవ్‌ను మర్యాదపూర్వకంగా కలిసి వినతిపత్రం సమర్పించి సమస్యను వివరించారు. ఈ సందర్భంగా వరంగల్ ఎంపీ డా.కడియం కావ్య మాట్లాడుతూ, హైదరాబాద్--భూపాలపట్నం జాతీయ రహదారి (ఎన్‌హెచ్-163)లోని యాదాద్రి--వరంగల్ నాలుగు లేన్ల విస్తరణ పనుల సమయంలో నిడిగొండ, రఘునాథపల్లి, చాగల్, స్టేషన్ ఘన్‌పూర్, చిన్నపెండ్యాల, కరుణాపురం గ్రామాల పరిధిలో సర్వీస్ రోడ్లు నిర్మించినప్పటికీ, వాటి మధ్య పలు ప్రాంతాల్లో అనుసంధాన లింకులు మిగిలిపోయాయని తెలిపారు. జనగాం సమీపంలోని. 87/200 కి.మీ నుంచి నిడిగొండ వరకు, నిడిగొండ నుంచి రఘునాథపల్లి వరకు, రఘునాథపల్లి నుంచి చాగల్ వరకు, చాగల్ నుంచి స్టేషన్ ఘన్‌పూర్ వరకు, స్టేషన్ ఘన్‌పూర్ నుంచి చిన్నపెండ్యాల వరకు, చిన్నపెండ్యాల నుంచి కరుణాపురం వరకు ఉన్న సర్వీస్ రోడ్లలో లింకులు లేకపోవడం వల్ల స్థానిక ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య వివరించారు. దీనిపై సానుకూలంగా స్పందించిన చైర్మన్ సంబంధిత అధికారులతో సమీక్షించి తగిన చర్యలు చేపడతామని హామీ ఇచ్చినట్లు ఎంపీ తెలిపారు.



## అంతర్జాతీయ సదస్సుకు ప్రొఫెసర్ ఆర్. మల్లికార్జున రెడ్డి

**అక్షరశక్తి, కేయూ క్యాంపస్ :** కాకతీయ విశ్వవిద్యాలయ భూవిజ్ఞానం విభాగాదిపతి ఆచార్య రాగి. మల్లికార్జున రెడ్డి ఈనెల 2-7 తేదీలలో జపాన్ లో జరుగుతున్న ఏవోజీఎస్ -2026 అంతర్జాతీయ సమావేశంలో "ఆల్కలైన్ మాగ్మాస్ విత్-ఇన్ ప్లేట్ టెక్టోనిక్ సెట్టింగ్, కాంట్రోలింగ్గ ప్రోసెస్ ఆఫ్ ధేర్ ఎవల్యూషన్: కేస్ స్టడీ ఫ్రమ్ ప్రకాశం ఆల్కలైన్ ప్రావిన్స్, సదరన్ ఇండియా" అనే అంశం పై తన పరిశోదనపత్రాన్ని సమర్పించుటకి ఆయన జపాన్ బయల్దేరి వెళ్ళారు. ఈ సందర్బంగా ప్రొ. మల్లికార్జున రెడ్డికి కేయూ విశ్వవిద్యాలయం వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్. కె ప్రతాప్ రెడ్డి, రిజిస్ట్రార్ ప్రొ. రామచంద్రం శుభాకాంక్షలు తెలిపారు.

4-08-2026_Layout 1 04-08-2026 20:03 Page 5







# కాజీపేట బ్రిడ్జిపై బీజేపీ ధర్నా

**ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి మాటలు కోటలు దాటాయి**

**పనులు మాత్రం కాజీపేట బ్రిడ్జి వద్దే ఆగిపోయాయి**

**బీజేపీ నాయకురాలు రావు పద్మ రెడ్డి**



**అక్షరశక్తి, కాజీపేట :** కాజీపేట ఫాతిమానగర్ వద్ద ఫ్లైఓవర్ బ్రిడ్జి నిర్మాణం పై స్థానిక ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి, తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ నిర్లక్ష్య వైఖరిని నిరసిస్తూ బిజెపి హనుమకొండ జిల్లా అధ్యక్షులు కొలను సంతోష్ రెడ్డి ఆధ్వర్యంలో, బిజెపి వరంగల్ పశ్చిమ నియోజకవర్గ నాయకురాలు రావు పద్మ రెడ్డి నేతృత్వంలో బిజెపి శ్రేణులు గురువారం ఫాతిమానగర్ బ్రిడ్జి వద్ద ధర్నా నిర్వహించాయి. ధర్నాలో మాజీ ఎమ్మెల్యే మార్తినేని ధర్మారావు, డా.పగడాల కాళీప్రసాద్ రావు, పులి సరోత్తం రెడ్డి, బిజెపి జిల్లా నాయకులు, వివిధ డివిజన్ అధ్యక్షులు పాల్గొన్నారు. కాజీపేట / ఫాతిమానగర్ వద్ద ఫ్లైఓవర్ బ్రిడ్జి నిర్మాణం ఐదేళ్లుగా మందగించి, రోజువారీ ట్రాఫిక్ నరకంతో నగర ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని బిజెపి తీవ్రంగా మండిపడింది. రావు పద్మ రెడ్డి మాట్లాడుతూ... “ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి గారూ... మీరు చెప్పిన టైమ్ అయి-పోయింది!” అని నేరుగా ప్రశ్నించారు. మేడారం జాతరలోపే కాజీపేట బ్రిడ్జి పనులు పూర్తి చేస్తామని హామీ ఇచ్చారని, కానీ మళ్లీ జాతర సమయం వచ్చిన బ్రిడ్జి నిర్మాణం పూర్తి అయ్యేలా లేదు అని ఇది, ప్రభుత్వ వైఫల్యానికి అద్దం పడుతోందన్నారు. గత టిఆర్ఎస్ హయాంలో రెండేళ్లు, ప్రస్తుతం కాంగ్రెస్ హయాంలోనూ పనులు ఎక్కడ వేసిన గొంగళి అక్కడే చందంగా మారాయని విమర్శించారు. పాత బ్రిడ్జి శిథిలావస్థకు చేరడంతో 78 లక్షల రూపాయల అంచనాతో టెండర్లు వేసినప్పటికీ కాంట్రాక్టర్లకు బిల్లులు చెల్లించకపోవడంతో పనులు నిలిచిపోయాయని ఆరోపించారు. పనుల ఆలస్యానికి అనుమతుల పేరుతో రైల్వేశాఖపై నెపం నెట్టవద్దని హెచ్చరించారు. కాంట్రాక్టర్ సామగ్రి, గడ్డర్లు సిద్ధం చేస్తే... రైల్వే పర్మిషన్లను కేంద్ర మంత్రులు జి. కిషన్ రెడ్డి, అశ్విని వైష్ణవ్ దృష్టికి తీసుకెళ్లి వెంటనే ఇప్పించే బాధ్యత తమదని స్పష్టం చేశారు. ఒకవేళ కాంగ్రెస్ ప్రభుత్వం బిల్లులు ఇవ్వకపోయినా కాంట్రాక్టర్ భయపడాల్సిన పనిలేదని, రేపు వచ్చేది బిజెపి ప్రభుత్వమేనని, రూపాయి బకాయి లేకుండా తీర్చే బాధ్యత తమదని ధీమా వ్యక్తం చేశారు. ప్రభుత్వం తక్షణమే స్పందించి కాజీపేట బ్రిడ్జి నిర్మాణాన్ని పూర్తి చేసి ప్రజల రవాణా కష్టాలను తీర్చాలని, లేనిపక్షంలో పోరాటాన్ని మరింత ఉధృతం చేస్తామని రావు పద్మ రెడ్డి హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో బిజెపి జిల్లా నాయకులు, వివిధ డివిజన్ అధ్యక్షులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## పంట నష్టపోయిన రైతులకు నష్టపరిహారం చెల్లించాలి

**ఏఐకేఎంఎస్ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు జక్కుల తిరుపతి, రాచర్ల బాలరాజు**

**అక్షరశక్తి, దుగ్గొండి :** ఖరీఫ్ సీజన్లో పత్తి విత్తనాలను నాటిన రైతుల పంట చేను ఎదుగుదల లేక పంట నష్టపోయారని అఖిలభారత రైతుకూలీ సంఘం ఏఐకేఎంఎస్ వరంగల్ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు జక్కుల తిరుపతి రాచర్ల బాలరాజు లు అన్నారు. మంగళవారం నాడు వరంగల్ జిల్లా దుగ్గొండి మండలం గోపాలపురం గ్రామంలో పత్తి విత్తనాలను నాటిన రైతుల పంటల పరిశీలనకు వెళ్లారు. గ్రామంలో రాశి స్వీఫ్ట్ కంపెనీకి చెందిన విత్తనాలను నాటారని కంపెనీ పేరుతో ఉన్న నకిలీ విత్తనాల వల్లనే రైతులు ఒక్క గ్రామంలోనే 50 ఎకరాలకు పైగా పంట నష్టపోయారని వారు ఆరోపించారు. దుగ్గొండి మండలంలో ఐదు గ్రామాలలో, జిల్లా వ్యాప్తంగా కూడా ఈ నకిలీ విత్తనాల వల్ల రైతులు పంట నష్టపోయారని వారు ఆవేదన వ్యక్తం చేశారు. జిల్లాలో నకిలీ విత్తనాలు అరికట్టడంలో వ్యవసాయ శాఖ అధికారులు విఫలమయ్యారని కొంతమంది షాపు యజమానితో కుమ్మక్కైన ఫలితమే రైతులకు ఈ పరిస్థితి దాపురించిందని వారు ఆవేదన వ్యక్తం చేశారు. జిల్లాలో నకిలీ విత్తనాల వల్ల నష్టపోయిన రైతులకు ఒక ఎకరానికి 50వేల రూపాయలను రాశి కంపెనీ నుండి నష్టపరిహారం ఇప్పించాలని విత్తనాలను అమ్మిన షాపు యజమానులపై క్రిమినల్ కేసులు నమోదు చేసి షాపులను సీజ్ చేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని వారు డిమాండ్ చేశారు.



## యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ పాఠశాల భవన నిర్మాణ పనుల పరిశీలన



**అక్షరశక్తి, భూపాలపల్లి (గణపురం):** భూపాలపల్లి నియోజకవర్గంలోని గణపురం మండలంలోని గాంధీనగర్ శివారులో గుట్టపై నిర్మాణంలో ఉన్న యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ పాఠశాల భవన నిర్మాణ పనులను మంగళవారం భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు పరిశీలించారు. ఈ సందర్భంగా నిర్మాణ పనుల పురోగతిపై అధికారులను, గుత్తేదారులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం గుత్తేదారులతో మాట్లాడుతూ పనులను త్వరితగతిన పూర్తి చేయడంతో పాటు నాణ్యత ప్రమాణాలకు ఎలాంటి భంగం కలగకుండా అత్యంత బాధ్యతతో చేపట్టాలని సూచించారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న ఈ విద్యా సంస్థ భవిష్యత్తు తరాలకు నాణ్యమైన విద్యను అందించే కేంద్రంగా నిలవాలని ఆకాంక్షించారు. పాఠశాల నిర్మాణంలో నాణ్యత, భద్రతా ప్రమాణాలను తప్పనిసరిగా పాటించాలని అధికారులను ఆదేశించారు.

4-08-2026_Layout 1 04-08-2026 20:03 Page 6



# సురక్ష కా తిరంగా - సైబర్ స్వతంత్ర తెలంగాణ

### ఈనెల 5న కార్యక్రమాన్ని ప్రారంభించనున్న జిల్లా ఎస్పీ డా. శబరీష్



**అక్షరశక్తి, మహబూబాబాద్ :** తెలంగాణ సైబర్ సెక్యూరిటీ బ్యూరో, హైదరాబాద్ ఆధ్వర్యంలో స్వాతంత్ర్య మాసాన్ని పురస్కరించుకొని రాష్ట్రవ్యాప్తంగా నిర్వహించనున్న "సురక్ష కా తిరంగా -- సైబర్ స్వతంత్ర తెలంగాణ" సైబర్ అవగాహన ప్రచార కార్యక్రమాన్ని మహబూబాబాద్ జిల్లా ఎస్పీ డా. శబరీష్ ఈనెల 5న తేదీన మధ్యాహ్నం 12.00 గంటలకు మహబూబాబాద్ ప్రభుత్వ మెడికల్ కళాశాల ఆడిటోరియంలో ప్రారంభించనున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ.. ఆగస్టు నెల మొత్తం జిల్లాలో సైబర్ నేరాల నివారణపై విస్తృత స్థాయిలో అవగాహన కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ప్రజల్లో సైబర్ భద్రతపై అవగాహన పెంపొందించడం, సైబర్ నేరాలను నివారించడం ఈ కార్యక్రమం ప్రధాన ఉద్దేశ్యమని పేర్కొన్నారు. ఇటీవలి కాలంలో స్టాక్ ఇన్వెస్ట్మెంట్ మోసాలు, బిజినెస్ ఇన్వెస్ట్మెంట్ మోసాలు, ఆన్‌లైన్ ట్రేడింగ్ మోసాలు, డిజిటల్ అరెస్ట్, ఫేక్ లోన్ యాప్‌లు, ఓటీపీ, కేవైసీ, సోషల్ మీడియా, ఉద్యోగాల పేరుతో జరిగే మోసాలు అధికంగా జరుగుతున్నందున ప్రజలు అత్యంత అప్రమత్తంగా ఉండాలని సూచించారు. "సురక్ష కా తిరంగా" ప్రచార సందేశమైన "ఆగు -- ఆలోచించు -- నిజం నిర్ధారించు -- సైబర్ భద్రత పెంచు" అనే సందేశాన్ని ప్రతి ఒక్కరూ జీవితంలో ఆచరించాలని పిలుపునిచ్చారు.జాతీయ సైబర్ జాగృక్తా దివస్ సందర్భంగా ఆగస్టు నెల పొడవునా మహబూబాబాద్ జిల్లా వ్యాప్తంగా పాఠశాలలు, కళాశాలలు, ప్రభుత్వ కార్యాలయాలు, బ్యాంకులు, వ్యాపార సంస్థలు, పరిశ్రమలు, మహిళా సంఘాలు, స్వచ్ఛంద సంస్థలు, రెసిడెంట్ వెల్ఫేర్ అసోసియేషన్లు, గ్రామ పంచాయతీలు, సాధారణ ప్రజల భాగస్వామ్యంతో సైబర్ భద్రతపై ప్రత్యేక అవగాహన కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. సైబర్ మోసాలకు గురైన వెంటనే ఆలస్యం చేయకుండా 1930 జాతీయ సైబర్ హెల్ప్‌లైన్‌కు ఫోన్ చేయాలని లేదా ఞఞఞ.ఎఎవతీఎతీఅఎవ.స్త్రశీఌ.ఱఅ వెబ్‌సైట్‌లో వెంటనే ఫిర్యాదు నమోదు చేయాలని ప్రజలకు సూచించారు.

# వైద్య సిబ్బంది సమయపాలన పాటించి విధులు నిర్వహించాలి

### జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ బి రవి రాథోడ్

**అక్షరశక్తి, మహబూబాబాద్:** వైద్య సిబ్బంది సమయపాలన పాటించి విధులు నిర్వహించాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ బి రవి రాథోడ్ అన్నారు. మంగళవారం జిల్లా కలెక్టరేట్ లోని వైద్య ఆరోగ్య శాఖ కార్యాలయంలో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ బి రవి రాథోడ్ జిల్లాలోని మండల ప్రాథమిక వైద్యాధికారులతో గూగుల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అధికారి మాట్లాడుతూ గిరిజన ప్రాంతాల్లో గూడూరు, కోమట్ల గూడెం, కొత్తగూడ, తీగల వేణి, గంగారం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో 24 గంటలు వైద్య సేవలు అందుబాటులో ఉంటాయని, ప్రత్యేకమైన సీజనల్ వ్యాదులలో భాగంగా విష జ్వరాలు, అతిసారం, పాము, తేలు కాటు మందులు అందుబాటులో ఉన్నాయని, ప్రత్యేకంగా డెంగ్యూ ,మలేరియా జ్వరముల వార్డులను ఏర్పాటు చేయడం జరిగిందని, వైద్య సిబ్బంది సమయపాలన పాటిస్తూ విధులు నిర్వహించవలసిందిగా సూచిస్తూ, జాతీయ ఆరోగ్య కేంద్రాల పథకాలపై సమీక్షించి, లక్ష్యాలు సాధించాలని సూచించినారు. తల్లిపాల వారోత్సవాల సందర్భంగా ఏఎన్ఎంలు, ఆశలు అంగనవాడి సిబ్బంది సమన్వయంతో తల్లి పాల ప్రాముఖ్యత లో కాన్పు కాగానే బిడ్డకు తల్లిపాలు( ముర్రిపాలు) పట్టించవలసిందిగా, ఈ పాలు మొదటి టీకా వలె వ్యాధినిరోధక శక్తి పెరుగుతుందని, జ్వరాల నియంత్రణలో భాగంగా ఇంటింటి సర్వే ద్వారా ఉ ండకుండా డ్రై డే కార్యక్రమం నిర్వహిస్తూ గ్రామపంచాయతీ సిబ్బంది సమన్వయంతో పరిసరాల పరిశుభ్రత, దోమల పుట్టకుండా కుట్టకుండా జాగ్రత్తలపై అవగాహన శిబిరాలు ఏర్పాటు చేయవలసిందిగా సూచించడం జరిగింది.
ఈ కార్యక్రమంలో ప్రోగ్రాం ఆఫీసర్లు డాక్టర్ శివకుమార్, డిప్యూటీ డెమో రాజ్ కుమార్, స్వామి, ప్రాథమిక ఆరోగ్య కేంద్ర వైద్యాధికారులు, సూపర్వైజర్లు, ఏఎన్ఎంలు, ఆశాలు పాల్గొన్నారు.







# విద్యార్థులకు నాణ్యమైన పుస్తకాలు అందించడమే లక్ష్యం

**అక్షరశక్తి, వరంగల్ :** విద్యార్థులకు అవసరమైన నాణ్యమైన పుస్తకాలను అందిస్తూ విద్యా ప్రగతికి విశేషంగా కృషి చేస్తామని తెలంగాణ రాష్ట్ర తెలుగు అకాడమీ చైర్మన్ ఆచార్య కూరపాటి వెంకట నారాయణ, అకాడమీ సంచాలకులు ఆచార్య భట్టు రమేష్ తెలిపారు. వరంగల్ జానపద గిరిజన విజ్ఞానపీఠం, వరంగల్ మిత్రమండలి సంయుక్త ఆధ్వర్యంలో నూతనంగా బాధ్యతలు చేపట్టిన తెలుగు అకాడమీ చైర్మన్ ఆచార్య కూరపాటి వెంకట నారాయణ, సంచాలకులు ఆచార్య భట్టు రమేష్‌లకు ఘన సన్మానం, ఆత్మీయ అభినందన సభ నిర్వహించారు. జానపద గిరిజన విజ్ఞానపీఠంలో డాక్టర్ గడ్డం వెంకన్న అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో పలువురు విద్యావేత్తలు, సాహితీవేత్తలు, ప్రముఖులు పాల్గొన్నారు.
ఈ సందర్భంగా ఆచార్య భట్టు రమేష్ మాట్లాడుతూ జానపద, గిరిజన విజ్ఞానపీఠంలో జరిగిన పరిశోధనలు అమూల్యమైనవని పేర్కొన్నారు. తెలుగు అకాడమీ ద్వారా విద్యార్థులు, పరిశోధకులకు ఉపయోగపడే నాణ్యమైన గ్రంథాలు, ఆధునిక అవసరాలకు అనుగుణమైన పాఠ్యాంశాలను అందించేందుకు కృషి చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో పీఠం సిబ్బంది, సాహితీవేత్తలు, జానపద కళాకారులు, పరిశోధక విద్యార్థులు పాల్గొని నూతన బాధ్యతలు చేపట్టిన తెలుగు అకాడమీ చైర్మన్, సంచాలకులకు శుభాకాంక్షలు తెలిపారు.

# గద్దరన్న మూడో వర్ధంతి సభను జయప్రదం చేయండి

**అక్షరశక్తి, హన్మకొండ :** ప్రజా యుద్ధనౌక గద్దరన్న మూడో వర్ధంతి సభ ఈనెల 06 వ తేదీన సాయంత్రం నాలుగు గంటలకు హైదరాబాదులోని రవీంద్రభారతిలో గద్దర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహించే వర్ధంతి సభను విజయవంతం చేయాలని దళిత బహుజన ఫ్రంట్ రాష్ట్ర ఉపాధ్యక్షులు చుంచు రాజేందర్ పిలుపునిచ్చారు. మంగళవారం నాడు డిబిఎఫ్ ఆధ్వర్యంలో హన్మకొండ జిల్లా హసన్‌పర్తి మండలం సీతంపేట గ్రామంలోని అంబేద్కర్ విగ్రహం వద్ద, ఎల్లాపూర్, హసన్‌పర్తి గ్రామాలలో గద్దరన్న మూడో



వర్ధంతి సభ సంబంధించిన పోస్టర్లను ఆవిష్కరణ చేశారు. ఈ సందర్భంగా డిబిఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షులు చుంచు రాజేందర్ మాట్లాడుతూ గద్దరన్న మూడవ వర్ధంతి సంస్మరణ సభకు ముఖ్యాతిథిగా బాబాసాహెబ్ అంబేద్కర్ మునిమనవడు ప్రకాష్ యశ్వంత్ అంబేద్కర్ హాజరవుతున్నారన్నారు. ఈ వర్ధంతి సభకు ప్రజలు, ప్రజాస్వామిక వాధులు, విద్యార్థులు, మేధావులు, అంబేద్కర్ వాధులు, గద్దరన్న అభిమానులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో డిబిఎఫ్ జిల్లా అధ్యక్షురాలు బొర్ర సంపూర్ణ, జిల్లా కార్యదర్శి బౌతు రాధ, జిల్లా ఉపాధ్యక్షురాలు మేకల అనిత, వసంత, రాజు, సందిప్, రమేష్, మధు, మణెమ్మ, సుగుణ, ఎల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

Printer, Publisher by Palle Ravi Vamshi Mohan on behalf M/s Creative Media Group by Printed at Ramani Web Offset Printers H.No. 8-82/11/1, Autonagar, Bommakal Village, Mdl&Dist: Karimnagar-505001. T.S. Published at H.No. 2-1-14, Saraswathi Nagar, Vidyaranyapuri, Mdl: Hanamkonda, Dist: Warangal-506009. T.S. Editor: Dr PR Vamshimohan.